సాక్షి
కుమురంభీం

సోమవారం ׀ 12 ׀ ఆగస్టు ׀ 2024



మోగిన పెళ్లిబాజా

శ్రావణమాసం ప్రారంభంతో శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. పెళ్లిళ్లు, నూతన గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు మంచిరోజులు వచ్చాయి. 8లో▸



వేతనాల కోసం ఆందోళన

ఐటీడీఏ, జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ల్లో పనిచేస్తున్న కార్మికులు ఆందోళన చేపట్టారు. వేతనాలు పెంచాలని కోరుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /26.9

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



ఏఐటీయూసీలో చేరిన మధ్యాహ్న భోజన కార్మికులతో నాయకులు

ఆసిఫాబాద్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సామాజిక ప్రమాద బీమా పథకం వర్తింపజేయాలని కోరారు. ప్రతినెలా 5లోగా బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నుంచి మధ్యాహ్న కార్మికులు ఏఐటీయూసీలో చేరినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, కార్మికులు కాంతమ్మ, బుజ్జమ్మ, రమాదేవి, విజయ, శ్రీదేవి, యశోద, సురేఖ, పోషక్క, కావేరి, ఆశమ్మ, లక్ష్మి, కమల, గంగమ్మ, జ్యోతి, తార పాల్గొన్నారు.

పూలాజీబాబా జయంతి ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

జైనూర్(ఆసిఫాబాద్): సద్గురు పూలాజీబాబా జయంతి ఘనంగా నిర్వహించాలని సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే అన్నారు. మండలంలోని పట్నాపూర్ గ్రామంలో ఆదివారం సిద్ధేశ్వర సంస్థాన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూలాజీబాబా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం అంద్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి పూలాజీబాబా జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంద్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాష్, జిల్లా అధ్యక్షుడు గారులే నారాయణ్, సంస్థాన్ గౌరవ అధ్యక్షుడు వామన్‌రావు, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు మహగాడే దాదారావు, కోండిబా బర్గే, సతీశ్ గురునుళే, పాండురంగ్, రంగారావు, గంగాధర్, మారుతి, సుభాష్ దుర్రే తదితరులు పాల్గొన్నారు.

కిల్లింగ్ జ్వరాలు!



'నాన్నా.. బాగా చదివి నీకు మంచి పేరు తెస్తా..' అని తండ్రికే ధైర్యం చెప్పిన ఆత్మవిశ్వాసం ఆ విద్యార్థినిది. అయితే ఆమె బంగారు భవిష్యత్తుపై విషజ్వరం పిడుగులా పడింది. ఆశలను చిదిమేస్తూ ప్రాణాలను హరించింది. కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన జాడె పూజ(16) ఆసిఫాబాద్‌లోని గిరిజన గురుకులంలో పదో తరగతి చదువుతోంది. బుధవారం జ్వరం వచ్చినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. గురువారం ఇంటికి తీసుకొచ్చి స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స అందించారు. శుక్రవారం అదే ఆర్‌ఎంపీ సెలైన్ బాటిల్ ద్వారా కొన్ని ఇంజక్షన్లు అందించగా తీవ్ర అస్వస్థతకు గురైంది. భయపడిన ఆర్‌ఎంపీ మధ్యలోనే వైద్యం నిలిపివేశాడు. కుటుంబ సభ్యులు చంద్రపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజామున కోమాలోకి వెళ్లిన పూజను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.



కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన బోయర్ కాళిదాస్(32) ఇంటికి పెద్ద కొడుకు. మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ భార్య, ఇద్దరు తమ్ముళ్లతో కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కాళిదాస్ జ్వరంతో బాధపడుతున్నారు. గురువారం స్థానిక ఆర్‌ఎంపీ వైద్యం చేస్తుండగానే ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు మొదట కౌటాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.. పై రెండు ఘటనలు జిల్లాలో విషజ్వరాల తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ వైద్యం అందుతున్న తీరు, ఆర్‌ఎంపీల తెలిసీతెలియని వైద్యంతో జరుగుతున్న అనర్థాలను తెలియజేస్తున్నాయి.



- గ్రామీణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు
- రెండు నెలల వ్యవధిలో 1,040 కేసులు నమోదు
- తెలిసీతెలియని వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీలు!
- వరుస ఘటనలపై స్పందించని ప్రభుత్వ యంత్రాంగం
- డేంజర్ జోన్‌లో పల్లెలు

కౌటాల/చింతలమానెపల్లి: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్, వాంకిడి, రెబ్బెన మండలాలతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు మంచం పట్టారు. జ్వరం, కీళ్ల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 334 గ్రామ పంచాయతీ ఉండగా.. ఏటా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న 63 సమస్యాత్మక గ్రామాలను వైద్యశాఖ గుర్తించింది. జిల్లాలో 22 వరకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు ఉండగా ప్రస్తుతం కేవలం 11 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో 47 మంది ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు)లు పని చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో గడిచిన రెండు నెలల వ్యవధిలో 1,040 జ్వరాల కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒకటి డెంగీ కాగా 19 మలేరియా కేసులు ఉన్నాయి. అనధికారికంగా వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలో జ్వర పీడితులు లక్షలకు పైగా ఉంటారని అనధికార అంచనా.. సాధారణ ఫ్లూ జ్వరంతోపాటు చికున్ గున్యా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు తీవ్రంగా ఉన్నాయి.

అధికార యంత్రాంగం విఫలం..!

రోగాల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. కానీ గ్రామాల్లో దీనికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. డ్రెయినేజీలు అధ్వానంగా ఉండగా.. క్లోరినేషన్, దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దోమలతో విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయి. మెరుగైన వైద్యం అందకపోవడం కూడా ప్రజలకు శాపంగా మారుతోంది. ఒకే వైద్యాధికారి నాలుగైదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా వైద్యపరంగా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే ఆధునిక సౌకర్యాలు లేవు. కొన్ని జ్వరాలను గుర్తించే అవసరమైన పరీక్షలు స్థానికంగా చేయడం లేదు.

ఆర్‌ఎంపీల వైద్యమే కారణమా..!

గుండాయిపేటలో పూజ, కాళిదాస్ జ్వరాల బారిన పడగా స్థానిక ఆర్‌ఎంపీలే వైద్యం అందించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, మంచిర్యాలలో వీరికి వైద్యం అందించిన ఆస్పత్రుల నుంచి అందిన సమాచారం మేరకు ఇద్దరు కోమాలోకి వెళ్లి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు తెలుస్తోంది. టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగీ, మలేరియా వంటి జ్వరాలకు శిక్షణ పొందిన నిపుణుల పర్యవేక్షణలోనే వైద్యం అందించాలి. డెంగీ నిర్ధారణ పరీక్షలు నేటికీ పరిమితంగా ప్రధాన ఆస్పత్రుల్లోనే నిర్వహిస్తున్నారు. కానీ గ్రామాల్లో ఆర్‌ఎంపీలే జ్వరాన్ని నిర్ధారించి చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన మహిళ, రవీంద్రనగర్ గ్రామానికి చెందిన బాలుడు, సిర్పూర్(టి) మండలం భూపలపట్నం గ్రామానికి చెందిన ఓ యువకుడు, కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన బాలుడు ఇదే తరహాలో ఆర్‌ఎంపీల వైద్యం వికటించడంతోనే మృతి చెందారు. ఈ ఘటనల్లో పోలీసు కేసులు సైతం నమోదయ్యాయి. ఆర్‌ఎంపీలు పరిమితికి మించిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడంతో కొద్దిరోజుల పాటు ఆర్‌ఎంపీలు వైద్యం పరిమితం చేశారు. ఆ తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం జ్వరాల అదుపునకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి

జ్వరానికి వైద్యమందించేటప్పుడు బాధితుడి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. డెంగీ వంటి జ్వరంతో ప్లేట్‌లేట్ల సంఖ్య తక్కువగా ఉన్న సమయంలో అవగాహన లేకుండా రోగికి ఇచ్చే మందులు వికటించే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. నిపుణులు ఆధ్వర్యంలో మాత్రమే చికిత్స అందించాలి.

– డాక్టర్ అజీముద్దీన్, డీడీవో

పెద్దపులా.. చిరుతా..!

- పరంధోళి అటవీ ప్రాంతంలో రెండు కుక్కలు హతం



కుక్క కళేబరం

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని అటవీ ప్రాంతంలో కొద్దిరోజులుగా అలజడి కొనసాగుతోంది. గ్రామాలకు సమీపంలో సంచరిస్తూ ఓ అడవి మృగం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. అటవీ అధికారులు మాత్రం ఇప్పటికీ అది పెద్దపులా.. చిరుతా.. అనేదానిపై స్పష్టతనివ్వడం లేదు. ఈ నెల 7న కరంజివాడ అడవుల్లో ఓ మేకను హతమార్చిన విషయం తెలిసిందే. తాజాగా పరంధోళి అటవీ ప్రాంతంలో బాలాజీ అనే రైతుకు చెందిన రెండు కుక్కలపై శనివారం రాత్రి దాడి చేసి హతమార్చింది. పరంధోళి తండాకు బాలాజీ తన రెండు కుక్కలను పంటను వన్యప్రాణులను నుంచి కాపాడుకునేందుకు చైన్‌తో పొలం వద్ద కట్టి ఉంచి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి రెండు కుక్కలు చనిపోయాయి. ఒక కుక్కను మృగం చంపి పేగులు బయటికి తీయగా.. మరోదాని వీపుపై గాయాలు ఉన్నాయి. పాదముద్రలు చిన్నగా.. పెద్దగా ఉండటంతో ఏ జంతువు అనేది ఇంతవరకు నిర్ధారించలేదని ఎఫ్ఆర్‌వో మజారొద్దీన్ తెలిపారు. రెండు కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అటవీ అధికారులు గాలించినా పాదముద్రలు మినహా ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని పేర్కొన్నారు. మరోవైపు పరందోళి గ్రామంలోని ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. మృతి చెందిన జంతువులకు పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు రామయ్య, నజీర్, నర్సింహారెడ్డి, దేవిదాస్, యానిమల్ ట్రాకర్ టీం సభ్యులు ఉన్నారు.

జీఎం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా ఎం.శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ పని చేసిన రవిప్రసాద్‌ను సింగరేణి యాజమాన్యం మార్కెటింగ్ జీఎంగా బదిలీ చేయగా.. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే గ్రూప్ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పిస్తూ ఏరియా జీఎంగా బదిలీ చేసింది. ఆయనతోపాటు ఎస్‌వోటూజీఎంగా రాజమల్లు సైతం బాధ్యతలు స్వీకరించారు. వివిధ విభాగాల ఉన్నతాధికారులు జీఎం, ఎస్‌వోటూజీఎంను శాలువాతో సన్మానించారు. కాగా.. నూతన జీఎం శ్రీనివాస్‌కు బెల్లంపల్లి ఏరియా సుపరిచితమే. గతంలో ఏరియా ఎస్‌వోటూజీఎంగా, కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా పనిచేశారు. ఏరియా నుంచి శ్రీరాంపూర్‌కు ఏరియాకు బదిలీపై వెళ్లి తిరిగి బెల్లంపల్లి ఏరియాకే వచ్చారు.



జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

కైరిగూడ ఓసీపీ సందర్శన

జీఎం శ్రీనివాస్ స్థానిక కైరిగూడ ఓసీపీని సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి వివరాలు, లక్ష్యాల వివరాలు తెలుసుకున్నారు. పీవో కార్యాలయంలో వారిని ఓసీపీ అధికారులు సన్మానించారు. డీజీఎం నరేందర్, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, ఏరి యా ఇంజనీర్ భీంరావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, కైరిగూడ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, వెల్ఫేర్ అధికారి వేణు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయాలు కొనసాగిద్దాం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయాలు కొనసాగిద్దామని ఉస్మానియా ప్రొఫెసర్ ఖాసిం పిలుపునిచ్చారు. పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన గద్దరన్న సంస్మరణ సభలో మాట్లాడారు. గద్దర్ అన్యాయంపై పోరాటం చేశారని, పీడితవర్గాల కోసం పోరుబాట పట్టారని గుర్తు చేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన తెలుగు రాష్ట్రాల ప్రజల మనస్సు దోచుకున్నాడన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ ప్రజల మనిషి అని, ప్రజల సమస్యలపై ఎనలేని పోరాటం చేశారన్నారు. గద్దర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ గద్దర్ ఎప్పుడూ హంగు ఆర్భాటాలకు వెళ్లలేదని, సాధారణ జీవితం గడిపారన్నారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ అల్లి రాజయ్య, కోశాధికారి జయదేవ్ అబ్రహం, నాయకులు సిడాం గణపతి, కొంగ సత్యనారాయణ, శాంతికుమారి, పెద్దపల్లి కిషన్‌రావు, రాజ్‌కమలాకర్‌రెడ్డి, యుఎస్ చారి, ఎట్కూరి శ్రీనివాస్, అబ్దుల్ అమర్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, మోయిన్, శ్యాంరావు, సోయం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు, తదితరులు

ఇన్‌స్ట్రక్టర్ల నియామకమెప్పుడో!

- రాష్ట్రంలో రెండు జిల్లాలకే పర్మిషన్
- ఉమ్మడి జిల్లాకు అనుమతిస్తే మేలు
- భారీసంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు
- స్కూళ్లల్లో కుంటుపడుతున్న బోధన



ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు తోడ్పడుతోంది. ఇటీవల పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఈనెల 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించగా ఇంకా ఫలితాలు వెలువడలేదు. కాగా, కొన్నేళ్లుగా నిరీక్షించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇటీవల ప్రమోషన్లు కల్పించింది. బదిలీలూ చేపట్టింది. దీంతో పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడి బోధన కుంటుపడుతోంది. ఆయా జిల్లాల అధికారుల అభ్యర్థ మేరకు ప్రభుత్వం నారాయణపేట్, వికారాబాద్ జిల్లాలకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరిట నియామకాలు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.15,600 చెల్లించేందుకు అంగీకరించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఉపాధ్యాయ ఖాళీలను ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే విద్యార్థులకు మేలు జరగనుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కుంటుపడుతున్న బోధన

గతంలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించి తరగతులు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా వీవీల నియామకం చేపట్టడం లేదు. ఆయా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ కాలం వెల్లదీశారు. ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులున్న చోట విద్యార్థుల సంఖ్య లేదు. విద్యార్థులున్న చోట సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 100 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు, మరో 50 వరకు ఒక్కో ఉపాధ్యాయుడు లేని పాఠశాలలున్నాయి. ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ సమయంలో పాఠశాలకు సెలవు అనే పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఏకోపాధ్యాయుడున్న పాఠశాల నుంచి ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదు. బదిలీ జరిగినా అదే చోట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక నాణ్యమైన విద్య అందడం లేదు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంది. కనీస బోధన సామర్థ్యాలూ కనిపించడం లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డీఈవో పరిధిలో 2,848 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 11,286 ఉపాధ్యాయులుండాల్సింది. కాగా, 2,079 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డీఎస్సీ నియామకాలు చేపట్టేదాకా తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే విద్యార్థులకు ప్రయోజనం జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే రెండు జిల్లాల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరిట డీఎస్సీ ప్రక్రియ పూర్తయ్యేదాకా విద్యాబోధన చేసేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలోనూ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే సర్కారు బడుల్లో చదువుకుంటున్న ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	కుమురంభీం	మొత్తం
డీఈవో పరిధిలో పాఠశాలలు :	678	714	735	721	2,848
ఉపాధ్యాయ పోస్టులు :	3,028	2,839	2,975	2,444	11,286
ఉపాధ్యాయ ఖాళీలు :	590	496	652	341	2,079

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. జిల్లాలో 590 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బోధనకు ఆటంకం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ఖాళీల వివరాలు గుర్తిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

పత్తిపై వానదెబ్బ



ఆసిఫాబాద్ మండలం మోతుగూడలో ఎర్రబారిన పత్తి మొక్కలు



రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన ఎస్.కొండయ్య 12 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. సీజన్ ప్రారంభంలోనే విత్తనాలు విత్తుకున్నాడు. 20 రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో నేలలో తేమశాతం పెరిగి మొక్కలు ఎర్రబారాయి. మరోవైపు చేనులో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. కలుపు నివారణకు గడ్డిమందు పిచికారీ చేయగా.. ఎర్రబారిన పత్తి మొక్కలు కాపాడుకునేందుకు అదనంగా రసాయన మందులు వినియోగించాల్సి వచ్చింది. గతంతో పోల్చితే పెట్టుబడి అధికమైంది. ఇలా.. జిల్లాలో చాలామంది పత్తి రైతులు అధిక వర్షాలు, కలుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.

- ఎడతెరిపి లేని వర్షాలతో ఎర్రబారిన మొక్కలు
- నేలలో తేమశాతం పెరిగి ఎదుగుదల లోపిస్తున్న వైనం
- విపరీతమైన కలుపుతో రైతుల ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పత్తి పంటపై వానలు తీవ్ర ప్రభావం చూపాయి. గతేడాది పోల్చితే ఈసారి సీజన్ ప్రారంభంలోనే రైతులు పొడి దుక్కిలోనే విత్తనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం పత్తి పంట పెరుగుదల దశలో ఉండగా.. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మొక్కల ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయి. ప్రతిరోజూ వర్షం పడుతుండటంతో నేలలో తేమశాతం అధికమవుతోంది. తేమ కారణంగా మొక్కలు ఎర్రబారిపోతున్నాయి. దీనికితోడు చేలల్లో అరకలు తిప్పే అవకాశం లేకపోవడం, కూలీ పనులు కూడా చేపట్టకపోవడంతో చాలా ప్రాంతాల్లో కలుపు పెరిగింది. చీడపీడలు నివారణకు సస్యరక్షణ చర్యలు అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎర్రబారుతున్న మొక్కలు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 3.5లక్షల ఎకరాల వరకు పత్తి పంటను పూర్తి వర్షాధారంగా రైతులు సాగు చేస్తున్నారు. తొలకరికి ముందే అధిక శాతం మంది రైతులు పొడి దుక్కిలోనే విత్తనాలు విత్తుకోగా.. అరకొర వర్షాలతో సరిగా మొలవలేదు. కొందరు రెండు, మూడుసార్లు విత్తనాలు విత్తుకోవాల్సి వచ్చింది. ఆపై వర్షాలతో పంట ఆశాజనకంగా కనిపించింది. గడిచిన 20 రోజులుగా జిల్లాలో ప్రతిరోజూ మోస్తారు వర్షం పడుతోంది. నల్లరేగడి, ఎర్ర రేగడి నేలలో పత్తి మొక్కల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నీటిని నిల్వ చేసుకునే స్వభావం ఉన్న భూముల్లో వర్షాలతో తేమ అధికమవుతుంది. మొక్కలకు తెగుళ్లు సోకి ఎర్రబారి వాడిపోతున్నాయి. చీడపీడల నివారణకు అవకాశం లేకుండా పోవడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంట సాగుకు పెట్టుబడి అధికమవుతోంది. అధిక తేమ కారణంగా పత్తిచేలల్లో అరకలు తిప్పే అవకాశం లేక కలుపు మొక్కలు పత్తి మొక్కలను మించి పెరిగాయి. కలుపు నివారణకు కూలీల ఖర్చులతో పాటు గడ్డి మందు పిచికారీ కోసం అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. వరద నిలిచిన ప్రాంతాల్లో మొక్కల వేర్లు సైతం కుళ్లిపోయి మొక్కలు చనిపోతున్నాయి. ఇష్టారీతిన రసాయన మందులు పిచికారీ చేస్తుండటంతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అయినా ఆశించిన ఫలితం కనిపించడం లేదని, వ్యవసాయశాఖ అధికారులు స్పందించి సరైన సలహాలు, సూచనలు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆందోళన వద్దు



కొన్ని రోజులుగా కురిసిన వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగి పత్తి మొక్కలు ఎర్రబారుతుంటే రైతులు ఆందోళన చెందొద్దు. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో పొడి వాతావరణం పెరిగింది. వారం రోజుల్లో పత్తి పంటల్లో పనులన్నీ సాగుతాయి. ఎర్రబారుతున్న మొక్కలపై మెగ్నిషియం, బోరాన్ వంటి రసాయనాలు పిచికారీ చేయాలి. యూరియా, పోటాష్ మందులు వేయాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో కూడిన పోస్టు చేసిన బీఆర్ఎస్ నాయకుడు గోగుల రవీందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. సీఐ రవీందర్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ నాయకులు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు ఎండీ బషీర్, చెన్నూరి శ్రీధర్, పాతర్ల నాగరాజు, చెన్నూరి రాజేశ్, ఎండీ హజు, లింగంపల్లి మహేశ్, వసీం, కలీల్ , సుల్తాన్, ముంతజీర్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని చింతకుంట వాడ కాలనీలో లింగయ్య ఇంట్లో ఆదివారం ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. లింగయ్య పురాతనమైన ఇంటికి తాళం వేసి ఉంది. గమనించిన ఇద్దరు మహిళలు వారి పిల్లల్ని ఇంటి బయట వదిలి, చోరీకి యత్నించారు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు.

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో శనివారం రాత్రి రెండోషిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో ట్రామర్ కార్మికుడు సోమశెట్టి శరత్‌కి గాయాలయ్యాయి. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరితోనే గనిలో ప్రమాదాలకు నెలవుగా మారిందని పలువురు కార్మికులు తెలిపారు. ప్రమాదాలు అరికట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. పక్కా సమాచారంతో కాలనీలో ఓ ఇంటిపై ఆదివారం దాడి చేసి వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.32,870 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సిబ్బంది బాబాజీ, సుబ్బారావు, భరత్ పాల్గొన్నారు.

కుండపోత వర్షం



మత్తడి దూకి ప్రవహిస్తున్న నీల్వాయి

వేమనపల్లి: మండల కేంద్రంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. పాలాలు చెరువులను తలపించాయి. నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకి ప్రవహించింది. కాగా, ఉదయం పత్తి చేలల్లో కూలీలతో రైతులు దొరకొట్టేందుకు అరకలు, కలుపు, మందు స్ప్రే చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం కుండపోత వానతో పాలాల్లో నీరు చేరింది.

మోగిన పెళ్లిబాజా



నిర్మల్‌లో షాపింగ్ చేస్తున్న మహిళలు(ఫైల్)



- శ్రావణంలో శుభముహూర్తాలు
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- ఫంక్షన్ హాళ్ల ముందస్తు బుకింగ్
- ఈవెంట్ మేనేజర్లు, ఫొటోగ్రాఫర్లు, బ్యూటీషియన్లకు గిరాకీ

నిర్మల్‌ఖిల్లా: మూడు నెలల మూఢం తర్వాత శ్రావణమాసం ప్రారంభమైంది. ఐదారురోజుల నుంచి శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. పెళ్లిళ్లు, నూతన గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు మంచిరోజులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ మేనేజర్లు, బ్యాండ్ మేళాలు, పూలు తదితర వాటికి గిరాకీ పెరిగింది. బంగారం, బట్టలు షాపుల్లో వధూవరుల కుటుంబ సభ్యులు కొనుగోళ్లలో బిజీగా ఉంటున్నారు. దీంతో ఆ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

సినిమా షూటింగులు తలపించేలా..

సినిమా షూటింగులు తలపించేలా పెళ్లి వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగానే ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తున్నారు. దీంతో ఫొటో, వీడియోగ్రాఫర్లకు గిరాకీ పెరగడం, ఈవెంట్ మేనేజర్లు, ప్రోగ్రాం ఆర్గనైజర్లు పెళ్లి పనుల నిర్వహణలో బిజీబిజీగా ఉన్నారు. అదేవిధంగా వేడుకల్లో వధూవరులు అందంగా కనిపించడానికి బ్యూటీషియన్లను సంప్రదిస్తున్నారు. ప్యాకేజీ కింద రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. ఇలా మంగళవాయిద్యాలు, ట్రావెల్స్ వాహనాలు, పూల అలంకరణ, టెంట్ సామగ్రి, వంటల నిర్వాహకులు ఆర్కెస్ట్రా, పురోహితులు, ఈవెంట్ మేనేజర్లకు పెళ్లిళ్ల సీజన్‌లో గిరాకీ లభిస్తోంది.

పూలు తప్పనిసరి..

ఏదైన శుభకార్యాలకు పూలు తప్పనిసరి. మల్లె, బంతి, చామంతి, గులాబీ తదితర పూలకు డిమాండ్ ఉంది. వివిధ రకాల దండలు, మాలలు, డిజైన్లు, డెకరేషన్ల కోసం ఈవెంట్ మేనేజర్లు, ఆర్గనైజర్లు పూలు వినియోగిస్తుంటారు. అలాగే, వధూవరుల కుటుంబసభ్యులతో జిల్లా కేంద్రాల్లోని షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి.

ఫంక్షన్ హాళ్ల ధర రూ.లక్ష నుంచి మొదలు..

పెళ్లి తేదీ ఖరారైన రోజునే ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు. వీటి అద్దె రూ.లక్ష నుంచి మొదలై రూ.8 లక్షల వరకు ఉన్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌తో రేట్లు అమాంతం పెంచారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 200లకు పైగా ఫంక్షన్ హాళ్లు ఉండగా, ఇప్పటికే నెల రోజుల వరకు బుకింగ్ పూర్తయినట్లు యజమానులు పేర్కొంటున్నారు.



ముస్తాబైన కల్యాణ మండపం (ఫైల్)

శుభ ముహూర్తాల తేదీలు..

ఈనెల 8, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో వివాహాలకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నెలరోజుల్లో దాదాపు 25 వేల నూతన జంటలు పెళ్లిబంధంతో ఏకం కానున్నారని నిర్మల్‌కు చెందిన పురోహితుడు సముద్రాల శ్రీకాంతాచార్యులు తెలిపాడు.

చేతినిండా పని లభించింది



పెళ్లి డెకరేషన్ల కోసం డిజైన్లు తయారు చేస్తుంటాం. వధూవరుల కుటుంబీకుల అభిరుచికి అనుగుణంగా డిజైన్లు చేస్తాం. మూఢం కారణంగా మూడు నెలలు తర్వాత శ్రావణ మాసంలో చేతినిండా పని లభించింది.

– బి.సంతోష్, డెకోరేటర్, ఈవెంట్ మేనేజర్

అభిరుచికి అనుగుణంగా..



వధూవరులు, కుటుంబసభ్యుల అభిరుచులకు అనుగుణంగా వెడ్డింగ్, ప్రీ వెడ్డింగ్‌లు, ఫొటో, వీడియోగ్రఫీ చేస్తుంటాం. వేడుకను అందంగా చిత్రీకరిస్తాం. ప్రస్తుతం సీజన్ మొదలుతో బిజీబిజీగా ఉన్నాం.

– రామరాజ్ కాంద్రే, వెడ్డింగ్ ఫొటోగ్రఫీ స్పెషలిస్టు

తల్లడిల్లిన కన్నతల్లి



పూజ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

- జ్వరంతో పూజ మృతి
- గుండాయిపేటలో విషాదం
- కన్నీరుపెట్టిన గ్రామస్తులు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి

కౌటాల: 'చిన్నప్పటి నుంచే తన కుమార్తె చదువు,, క్రీడల్లో ముందుండేదని, చదువు పూర్తికాగానే పోలీస్ ఉద్యోగం సాధిస్తానని చెప్పేదని, ఇంతలోనే దేవుడు నాకు అన్యాయం చేశాడు 'అంటూ పూజ మృతదేహంపై పడి తల్లి సురేఖ బోరున విలపించింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ వ్యవసాయం చేస్తూ సంతోషంగా జీవిస్తున్న తమ కుటుంబంలో మాయదారి జ్వరం తమ కుమారుడిని పొట్టనపెట్టుకుందని కాళీదాస్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు బోరున విలపించారు. ఒకే కాలనీకి చెందిన ఇద్దరు ఒకేరోజు మృతిచెందడంతో కౌటాల మండలం గుండాయిపేటలో విషాదం అలుముకుంది. అందరితో కలివిడిగా ఉండే విద్యార్థి పూజ, యువకుడు కాళీదాస్ మృతదేహాలను చూసి ఊరంతా కన్నీరు పెట్టుకుంది. ఆదివారం అశ్రునయనాల మధ్య మృతదేహాలకు కుటుంబీకులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గుండాయిపేట గ్రామానికి చెందిన పూజ, కాళీదాస్ జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందడంతో ఆదివారం సాయంత్రం డీఎంహెచ్‌వో తుకారాం గుండాయిపేట్ గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూజ మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారం, ఎంపీవో మహేందర్, కార్యదర్శి తిరుపతి, వైద్యసిబ్బంది ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న వైద్యశాఖ అధికారులు

జ్వరంతో యువకుడి మృతి

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన బోయర్ ఉమాజీ–అనసూయ దంపతుల పెద్దకుమారుడు కాళిదాస్(32) జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కాళిదాస్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో ఈనెల 7న కౌటాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం కాళిదాస్ అంత్యక్రియలు గ్రామంలో పూర్తి చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు సోదరులు ఉన్నారు. కాగా, జ్వరంతో ఇదే గ్రామానికి విద్యార్థి జాడె పూజ(16) శనివారం మృతి చెందింది. గంటల వ్యవధిలో ఇద్దరు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సైబర్ నేరగాళ్ల మోసం

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాధితుడి ఫోన్‌లోకి యాప్‌ను పంపించి లింక్ ఓపెన్ చేస్తే రూ.900లు వస్తాయని చెప్పడంతో నమ్మాడు. బాధితుడు అది ఓపెన్ చేయగా నగదు వచ్చింది. వారం తర్వాత వారు చెప్పినట్టుగా రూ.10 వేలు బ్యాంక్ ఖాతాలో వేయగా రూ.19 వేలు వచ్చాయి. కొన్ని రోజులకు నేరగాడు ఫోన్ చేసి లింక్ పంపించాడు. రూ.20 వేలు పంపిస్తే రూ.68 వేలు వస్తాయని చెప్పడంతో డబ్బు పంపించాడు. రాలేదని హోల్డ్‌లో పడ్డాయని రూ.68 వేలు డిపాజిట్ చేస్తే మొత్తం కలిపి డబుల్ వస్తాయని తెలపడంతో డిపాజిట్ చేశాడు. ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయానని బాధితుడు గ్రహించి 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వర్గీకరణపై బీజేపీ కుట్ర

మంచిర్యాలటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మనువాద పార్టీ బీజేపీ కుట్ర అని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. దళితులకు క్రిమిలేయర్ ద్వారా దెబ్బతీయాలని, మున్ముందు రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర దాగుందన్నారు. షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌ను 15 నుంచి 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. నాయకులు బంగారు సాయిలు, కిష్టయ్య, వెంకటేశ్వర్లు, భవిత, దీపక్, రమేశ్, సుధాకర్, శ్రీనివాస్, నరేశ్, విజయ్ కుమార్, చంద్రశేఖర్, నర్సయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ హైమద్ (35) ఉరేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు..షేక్ హైమద్ కూలీ పనులు చేసుకుంటూ భార్యను పోషించుకునేవాడు. గత రెండు రోజుల నుంచి కనపించకపోవడం, ఇంట్లో నుంచి కుళ్లిన వాసన రావడంతో గ్రామస్తులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. శవం కుళ్లిపోయి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

గోడ పై నుంచి పడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ జిన్నింగ్ మిల్లు గోడపై నుంచి పడి గొల్లి రాజేశ్వర్ (54) మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఆదిలాబాద్‌లోని చోట తలాబ్‌కు చెందిన రాజేశ్వర్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ప్రమాదవశాత్తు గోడపై నుంచి పడి మృతి చెందారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై ముజాహిద్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందాల్సి ఉందన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

మామడ: మామడ సమీపంలో ఆదివారం పాలు తీసుకువెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ అనిల్, క్లీనర్ విఘ్నేష్‌లు వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. జేసీబీ సాయంతో వారిని బయటకు తీశారు. గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

భగీరథ పైపుల ధ్వంసం!

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్‌లో డంప్ చేసిన మిషన్ భగీరథ పైపులను ఆదివారం ఇద్దరు వ్యక్తులు జేసీబీతో ధ్వంసం చేస్తుండగా, స్థానికులు గమనించి అడ్డుకున్నారు. ఎందుకు ధ్వంసం చేస్తున్నారని ప్రశ్నించగా, అక్కడి నుంచి పారిపోయినట్లు కాంగ్రెస్ నాయకుడు శంకర్ చంద్రే తెలిపారు. కొన్నిరోజులుగా పైప్‌లు ధ్వంసం చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై పట్టణ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

శిథిలావస్థలో..

- 3 వేల పైచిలుకు సింగరేణి క్వార్టర్లు
- విరిగిన తలుపులు కిటికీలు
- నిర్వహణ పట్టించుకోని ఉన్నతాధికారులు



నిరుపయోగంగా స్పెషల్ సీ క్వార్టర్లు



శిథిలమవుతున్న క్వార్టర్లు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంపై ఏం ప్రయోగాలు జరుగుతున్నాయి..పని గట్టుకుని పట్టణాన్ని పనికిరాకుండా చేస్తున్నది ఎందుకు..? వేల క్వార్టర్లు శిథిలమై..తలుపులు కిటికీలు లేక సాక్షాత్కారమిస్తోంటే ఎందుకని చోద్యం చూస్తున్నారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక్కొక్క డిపార్ట్‌మెంట్, గనులను భూస్థాపితం చేస్తూ వస్తున్న యాజమాన్యం క్వార్టర్ల విషయంలో స్పష్టమైన నిర్ణయం ఏం తీసుకుంటుందనేదే పెద్ద సంశయం కలిగిస్తోంది. సంస్థ కార్యాలయాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాక ఈ క్వార్టర్లను ఏం చేస్తారు. కనీసం అద్దె ప్రాతిపదికన ఇతరులకు కేటాయించే యోచన ఏమైనా ఉందా? భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిన రామకృష్ణాపూర్ సింగరేణి క్వార్టర్ల శిథిలావస్థకు చేరాయి.

రామకృష్ణాపూర్ ప్రాంతం గతంలో ఒక ఏరియాగా వెలుగొందింది. ఏడెనిమిది భూగర్భ గనులు, జీఎం కార్యాలయం సహా వివిధ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం వేలాది క్వార్టర్లు నిర్మించారు. మొత్తం 3వేల పైచిలుకు క్వార్టర్లు పట్టణ పరిధిలో ఉన్నాయి. ఏ, స్పెషల్ ఏ, బీ టైప్, , సీ, స్పెషల్ సీ టైప్, సీ–2 క్వార్టర్లు నిర్మించారు. వీటితోపాటు డీ టైప్, స్పెషల్ డీ టైప్, షిర్కే, నాగార్జున క్వార్టర్లు నిర్మించారు. గనులకు సమానంగా కార్మికుల సంఖ్య ఉండటంతో క్వార్టర్ల కేటాయింపు అదే స్థాయిలో జరిగింది. కాలక్రమేణా ఏరియా ఎత్తివేశారు. భూగర్భ గనులు కూడా మూతపడ్డాయి. కళకళలాడిన పట్టణం కళావిహీనంగా మారింది. దీంతో క్వార్టర్లు ఎందుకు పనికి రాకుండా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

ఇతర ప్రాంతాలకు బదిలీలు

స్థానికంగా ఉన్న బొగ్గు గనులు మూతపడడంతో కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లికి కొందరు వెళ్లగా మందమర్రి, గోదావరిఖని, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో మరికొందరు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కార్మికుల సంఖ్యను తీసుకుంటే 500 నుంచి 600 మంది వరకే ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే 2 వేలకు పైగా క్వార్టర్లలో ఇతరులు ఉంటుండగా మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. అయినా, ఏరియాకు వచ్చే ఏ ఉన్నతాధికారి కూడా ఈ క్వార్టర్లపై ఏ మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా క్వార్టర్ల నిర్వహణ సైతం గాలికి వదిలేశారని కార్మికులు అంటున్నారు. రోజురోజుకూ ఎదురవుతున్న చేదు అనుభవాల నేపథ్యంలో కనీసం ఇక్కడే పుట్టి..ఇక్కడే పెరిగిన తామంతా ఏమైపోవాలనే ఆవేదన పలువురి నుంచి వ్యక్తమవుతోంది.

అద్దె ప్రాతిపదికన కేటాయిస్తే మేలు

రామకృష్ణాపూర్‌లో క్వార్టర్లను అద్దె ప్రాతిపదికన కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చాలా వరకు శిథిలమయ్యాయి. తలుపులు కిటికీలు దొంగలపాలవుతున్నాయి. వర్షాలకు కొన్ని క్వార్టర్లు ఉరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో అద్దెకు ఇచ్చే అంశాన్ని ఆలోచిస్తే బాగుంటుందని సంస్థకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కళావిహీనంగా మారి పట్టణ ఉనికే ప్రశ్నార్థకమైన రామకృష్ణాపూర్‌లో శిథిలమైపోతున్న క్వార్టర్లనైనా బాగుచేయాలని కార్మికులు, కార్మికేతరులు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంపైనే ఆధారపడిన వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతున్నారు. సింగరేణిలో గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఈ దిశగా ఆలోచన చేసి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని విన్నవిస్తున్నారు.

'కడెం'లో బోటు షికారు



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్ట్ అందాలను వీక్షించి.. ఆ తర్వాత బోటింగ్ చేశారు. అనంతరం వనభోజనాలు చేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

'వసతి' అధ్వానం





శిథిలావస్థకు చేరిన వసతిగృహ భవనం



పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి వసతితో కూడిన విద్యనందిస్తుంటే అధికారుల నిర్లక్ష్యం వారి పాలిటశాపంగా మారుతోంది. జైనథ్ మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం మావల మండల కేంద్రంలో కొనసాగుతోంది. తరగతి, వసతి గదులు అవే కావడం, అందులో ఫ్యాన్లు లేకపోవడం, ట్యూబ్ లైట్లు స్విచ్ బోర్డులు పనిచేయక అధ్వానంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దీనావస్థలో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్